మంచిర్యాలలో మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ

ముస్లింల ప్రధాన శత్రువు కాంగ్రెస్సే

- బీఆర్ఎస్‌తోనే మైనార్టీల సంక్షేమం
- మంచిర్యాల సమావేశంలో హోంమంత్రి మహమూద్ అలీ
- దివాకర్‌రావును మరోసారి ఆశీర్వదించాలని పిలుపు

మంచిర్యాల టౌన్, నవంబర్22 : ముస్లింల ప్రధాన శత్రువు కాంగ్రెస్ పార్టీయేనని, ముస్లిం మైనార్టీల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. మంచిర్యాల పట్టణంలోని ఎఫ్‌సీఐ ఫంక్షన్ హాల్‌లో బుధవారం రాత్రి ముస్లింల సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో 204 ముస్లిం గురుకులాలను ఏర్పాటు చేసి, నిరుపేదలైన విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తున్నారని అన్నారు.11 మంది ఎంబీబీఎస్, 143 మంది బీడీఎస్, ఒక పైలట్, 1500 మంది ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు మొత్తం 5300 నిరుపేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ముస్లింలు విదేశీ విద్యనభ్యసించడానికి సహాయం అందజేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే ముస్లింలు తలెత్తుకొని జీవిస్తున్నారని అన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కేసీఆర్ పెద్దపీట వేశారన్నారు. షాదీ ముబారక్ పథకంలో ఎన్నో పేద కుటుంబాలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన వ్యక్తి అని ఆరోపించారు. ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం అందించిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. దశాబ్దాల కాలం నుంచి కాంగ్రెస్ పార్టీ ముస్లిం, మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుంటుందన్నారు. ఉన్నత విద్యాభ్యాసం అందించకుండా ఎంతో మందిని నిరక్షరాస్యులుగా మిగిల్చారన్నారు. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్‌లాంటి నగరాల్లో అల్లర్లు, కర్ఫ్యూలు జరిగేవని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక అల్లర్లు, కర్ఫ్యూలు లేకుండా పోయాయన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారం కోసం మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.పట్టణాల్లో షాదీఖానాలు నిర్మించి ముస్లింలకు అండగా నిలిచామన్నారు. మైనార్టీలకు అన్ని విధాలుగా అండగా నిలిచిన కేసీఆర్ సర్కారు వెంటే మైనార్టీలు ఉన్నారన్నారు.మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మంచి మనసున్న దివాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ భానుప్రసాద్ రావు, బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, పట్టణ కౌన్సిలర్లు, ముస్లిం మైనార్టీ నాయకులు జమీల్, అంజద్‌ఖాన్, మినాజ్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధా? అరాచకమా?

- ప్రజలు ఎటువైపో తేల్చుకోవాలి
- రేవంత్ బెదిరింపులకు భయపడం
- నాడు కాంగ్రెస్ అల్లర్లను విస్తరించింది
- నేడు బీఆర్ఎస్ ఐటీని విస్తరిస్తున్నది
- మీడియాతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో మాజీ ఎంపీ సీతారాంనాయక్, మేయర్ దండు నీతూకిరణ్ తదితరులు

ఖలీల్‌వాడి, నవంబర్ 22: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు బీఆర్ఎస్ అభివృద్ధికి, కాంగ్రెస్ అరాచకానికి మధ్య జరుగుతున్నవని, ప్రజలు ఎటువైపు ఉంటారో తేల్చుకోవాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. పోలీసుల పేర్లను రెడ్ డైరీలో రాసుకుంటామని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అంటున్నారని, ఆయన బెదిరింపులకు భయపడేవాళ్లు ఇక్కడ ఎవరూ లేరని ఆమె స్పష్టం చేశారు. కానీ.. కాంగ్రెస్ పార్టీ పేరును తెలంగాణ ప్రజలు ఇప్పటికే రెడ్ డైరీలో రాసుకున్నారని, ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో ఓటుతో సరైన గుణపాఠం చెప్తారని తెలిపారు. బోధన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి షకీల్, కార్యకర్తలపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని కవిత తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బుధవారం నిజామాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. 80 సీట్ల కన్నా ఒక్కటి తక్కువ వచ్చినా ఏదంటే అది చేస్తానని రేవంత్‌రెడ్డి అంటున్నారని, ఇలాంటి సవాళ్లను 10 సార్లు చేశారని, కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని గత ఎన్నికల్లో అన్నారని గుర్తుచేశారు. నాడు కాంగ్రెస్ పార్టీ జిల్లాల్లో అల్లర్లను విస్తరిస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలకు ఐటీ రంగాన్ని విస్తరించిందని తెలిపారు. తమ పార్టీ బోధన్ అభ్యర్థి షకీల్‌పై కాంగ్రెస్ నేతలు దాడి చేశారని, ఈ సందర్భంగా జిల్లాకు వచ్చిన రేవంత్‌రెడ్డి కొంత బాధ్యతగా మాట్లాడుతారని అనుకుంటే.. ఆయన ఉల్టా పోలీసులను విమర్శిస్తున్నారని చెప్పారు. నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలపై భౌతిక దాడికి దిగడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. మొన్న దుబ్బాక, నిన్న మంథని, బోధన్‌లో కాంగ్రెస్ దాడులు చేసిందని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, మేయర్ దండు నీతూకిరణ్ పాల్గొన్నారు.

కరీంనగర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్

కారు మనదే.. సర్కారూ మనదే

- కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్

కొత్తపల్లి, నవంబర్ 22: 'రాబోయేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే.. కారు మనదే.. సర్కారు మనదే. వారం రోజులు నా కోసం పని చేయండి.. ఐదేండ్లు మీకోసం పని చేస్తా' అని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. బుధవారం ఉదయం కొత్తపల్లి పట్టణం, సాయంత్రం కరీంనగర్‌లోని 39, 57, 58 డివిజన్లలో విస్తృతంగా ప్రచారం చేశారు. మంత్రి మాట్లాడుతూ.. తాను చేసిన అభివృద్ధి ప్రజల కండ్లముందు ఉన్నదని, దానిని గుర్తించి మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిపై 32 కేసులతో రౌడీషీట్ నమోదైందని, కోట్లాది రూపాయలు తీసుకుని భూ కబ్జాదారుడికి ఆ పార్టీ టికెట్ కేటాయించిందని, అలాంటి వ్యక్తికి ఓట్లు ఎలా పడుతాయని ప్రశ్నించారు. కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఎప్పుడైనా కొత్తపల్లికి వచ్చి కనిపించాడా ? అని ప్రశ్నించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా కొనసాగిన కాలంలో టికెట్లు అమ్ముకున్నాడనే ఆరోపణలతో పదవి నుంచి తొలగించారని విమర్శించారు.

కాంగ్రెస్‌కు ఓటేసి కష్టాలు తెచ్చుకోవద్దు

ఎన్నికల ప్రచారంలో మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, నవంబర్ 22: కాంగ్రెస్ నేతల మాటలు నమ్మి ఓటేసి కష్టాలను కొనితెచ్చుకోవద్దని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం వనపర్తి జిల్లాలోని పలు గ్రామాలు, తండాల్లో మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాలెట్ నమూనాతో ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఎక్కడ చూసినా కరువు తాండవం చేసేదని గుర్తుచేశారు. కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లో రైతుబంధు, రైతుబీమా, నిరంతర కరెంట్ అమలు చేస్తున్నదా? అని ప్రశ్నించారు. రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ హయాంలో తెలంగాణ రూపురేఖలు మారిపోయాయని చెప్పారు. వనపర్తికి సాగునీరు తీసుకొచ్చేందుకు 2014 నుంచి శ్రమించినట్టు తెలిపారు. మిట్ట ప్రాంతాల్లోని పొలాలకూ సాగునీరు పారించేందుకు 70 మినీ లిఫ్టులు, 15 చెక్ డ్యాంలను ఏర్పాటు చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీచైర్మన్ లోకనాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రచారంలో బ్యాలెట్ నమూనాతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

రెండో రోజూ ఐటీ దాడులు

- ఆదిత్య కాటన్ మిల్లు భాగస్వాముల లావాదేవీలపై ఆరా
- కొనసాగుతున్న సోదాలు

జమ్మికుంట, నవంబర్ 22: కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని ఆదిత్య కాటన్ మిల్లు వ్యాపార భాగస్వాములపై ఇన్‌కమ్ ట్యాక్స్(ఐటీ) శాఖ అధికారుల దాడులు బుధవారం రెండో రోజూ కొనసాగాయి. ఈ సోదాల్లో వారి ఆర్థిక లావాదేవీలు, బ్యాంకుల్లో నుంచి పెద్ద మొత్తంలో నగదు నిల్వ, బదిలీలు, విత్‌డ్రాలు, స్థిరాస్తి కొనుగోళ్లు, రుణాలు తదితర అంశాలపై ప్రశ్నించినట్టు సమాచారం. భూముల క్రయవిక్రయదారులు, రైతులు, వ్యాపారులను పిలిపించి.. కాటన్ క్రయవిక్రయాలకు సంబంధించిన రికార్డుల పరిశీలన, అకౌంట్ల నిర్వహణపై లోతుగా విచారిస్తున్నట్టు తెలిసింది. జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రముఖ కాటన్ వ్యాపార భాగస్వాములు ముక్కా శివకుమార్, ముక్కా నారాయణ, బచ్చు భాస్కర్ తదితరుల మిల్లులు.. ఇండ్లపై కేంద్ర బలగాల సిబ్బంది బందోబస్తు మధ్య ఐటీ అధికారుల బృందం మంగళవారం ఉదయం నుంచి బుధవారం రాత్రి వరకూ ఏకకాలంలో సోదాలు చేస్తున్నది. తనిఖీల్లో ముక్కా శివకుమార్, ముక్కా నారాయణ ఇండ్లల్లో లెక్కా పత్రాల్లేని నగదు, బంగారు, వెండి వస్తువులు, స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలు దొరికినట్టు తెలిసింది.

వేల్పూర్ ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

కాంగ్రెస్ రంగుల ప్రపంచాన్ని నమ్మొద్దు

- రైతు రుణ మాఫీని ఆపింది కాంగ్రెస్సే
- కమ్మర్‌పల్లి మండలంలో మంత్రి వేముల

కమ్మర్‌పల్లి /మోర్తాడ్, నవంబర్ 22: ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ చూపిస్తున్న రంగుల ప్రపంచాన్ని నమ్మొద్దని, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేసే పార్టీకే ఓట్లు వేసి గెలిపించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల, వేల్పూర్ మండలాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ ఆచరణకు సాధ్యం కాని హామీలతో మ్యానిఫెస్టో తెచ్చి ప్రజలకు రంగుల ప్రపంచాన్ని చూపించే ప్రయత్నం చేస్తున్నదని, బీజేపీ కూడా ఇదే మాదిరిగా మాయమాటలు చెప్తున్నదని పేర్కొన్నారు. దేశంలో ఈ రెండు పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ మాదిరి పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రైతుల రుణ మాఫీని ఆపిందే కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. మహా అంటే 3వ తేదీదాక ఆపగలరు.. ఆ తర్వాత రుణ మాఫీ పూర్తిగా అమలవుతుందని చెప్పారు. రాష్ట్రాన్ని కేసీఆర్ చేతిలో ఉంచితేనే శ్రీరామ రక్ష అన్నారు.